లంచగొండి

తాతయ్య అన్నాడు

"మన మెప్పుడూ వుద్యమంయొక్క మంచిచెడ్డలు చూడవలసిందేగాని, వుద్యమం లేవదీసినవాళ్ళ కారక్టర్ను గురించి మాట్లాడగూడదు అలాగైతే, మార్క్సు, రాయి —"

"రాయా ?"

"ఆఁ రామమోహన్‌రాయి, యం. ఎన్ రాయికాదు — హిట్లరూ, చెలపతీ —"

"చెలపతెవరూ ?"

"నీకు ఒక్కటీ తెలీదు — అంతా ఎరిగినట్టు పోజు వేస్తావు వాడి చలవని నేను ఒక లక్ష బ్యాంకులో వేసుకోటమే కాకుండా తలెత్తుకు తిరుగుతున్నాను ?"

తాతయ్య తృప్తిగా నిట్టూర్చాడు.

"ఎవరా మహానుభావుడు ?"

"నీకెలా తెలుస్తుందోయ్ ? ఒక్క పుస్తకం చదవ్వు ! మా చిన్నతనంలో అతని రచనలకోసం తన్నుకునేవాళ్ళం. అతని పుస్తకం దొరికిందంటే బిడి ఎగ్గొట్టి, తలుపులు బిగించి చదువుకునేవాళ్ళం — పెద్దవాళ్ళు తిట్టనీ, కొట్టనీ తర్వాత."

"మరిప్పుడు ! —"

"ఏమిటిప్పుడు ? అతనిపని తీరిపోయింది. అతను వేసిన వితనం అంతటా పాకింది. అందుకనే మీకళ్ళకి అది విలక్షణంగా కనపడడం లేదు. సరే, ఒకటి అడుగుతాను; లంచం పుచ్చుకోటం తప్పా ?"

"ఎవరంటారు, ఆ మాట ?"

"అన్నారు ఒకప్పుడు. ఆ పని చేసినందుకు చెలపతిని పురుగులాగా చూశారు !"

"మరి అతను ఊరుకున్నాడా ?"

"ఊరుకోలేదు, ఎదురుతిరిగి, అందరితో పోట్లాడాడు."

"నువ్వెరుగుదువా ?"

"నేను చిన్నవాణ్ణి; మా నాన్న బాగా

'చక్రపాణి'

ఎరుగు ఆయన చెప్పిన విషయాలే నీకు చెప్పుతాను "

* * *

చెలపతీ అందరిలాంటి మనిషే అందరిలో వుండే లోట్లు అతనిలోనూ వున్నై. కాని, అందరూ తమలో వున్న అన్నిలోట్లూ దాస్తే, చెలపతి నూటికి ముప్పాతిక తనే బయటపెట్టేవాడు — ఇతర్లకు సందివ్వకుండా, ఇవే అన్నీ అన్నట్టు ! ఇక యితర్ల విషయంలో చెలపతి డాక్టరులాగా ప్రవర్తించేవాడు. నిర్దయగా, మత్తుమందివ్వకుండా, స్పృహలో వుండగానే వాళ్ళ 'లోట్ల'నే కుళ్ళు శస్త్రంచేసి పారేశేవాడు. అంతా బాధ కోర్చుకుని కూడా చికిత్స చేయించుకునేవాళ్ళు. చేయించుకోక ఏం చేస్తారు ? తమ నోటితో తమలోట్లను చెప్పుకోలేక పోయారుగాని, ఒకళ్ళు చూపినప్పుడు వొప్పుకోక చస్తారా ? పైగా చెలపతి నిప్పంటి మనిషని వాళ్ళ నమ్మకం. అతని నోటికి వెరిచేవాళ్ళుకూడా. ఆఫీసులో అంతా అతన్ని రెస్పెక్టు చేసేవాళ్ళు. ఒకానొక సందర్భంలో చెలపతి గడ్డి కరవవలసి వొచ్చింది, కరిచాడుకూడా. కాని, కొత్తకావటంవల్ల జీర్ణించుకోలేక పోయాడు. ఆ పసరు కళ్ళకి తట్టి, అతనికి ప్రపంచం మరోవిధంగా కనుపించ నారంభించింది. సాటివాళ్ళంతా తన్ను సందేహిస్తున్నారని అనుకున్నాడు. ఎలా తెలిసిందీ వాళ్ళకి ? తను కతిగింది చుట్టాల దగ్గరగా, అదీ పై అధికారికిస్తానని చెప్పి ! చెలపతికి చిక్కు వీడ లేదు. విడదీయటానికి చూసినకుందికీ పెనవేసుకుపోయింది

కాని చెలపతిని ఎవ్వరూ అడగలేదు. ఆ ప్రశంసకూడా తేలేదు !

చెలపతికి ఈ మౌనం మరీ దుర్భరమైంది ! అధికారి పిలిచి అందరి ఎదటా చివాట్లు వేసినా అతని కింత కష్టముండేది కాదు, సమాధానం చెప్పుకునేవాడు. కాని, ఈ కేటాయిం పేమిటి ? చెలపతి ఆగలేకపోయాడు.

"మా వాడు జలగలాగా పట్టుకుంటే గత్యంతరంలేక చేశాను" అన్నాడు రామ్మూర్తి దగ్గర.

"ఏమిటీ ?" అన్నాడు అతను.

చెలపతికి వొళ్ళు మండింది. వెధవ తెలియనట్టు నటించి తన నోటిమీదుగా చెప్పించాలని చూస్తున్నాడని అనుకుని అతనితో పోట్లాడాడు.

ఆ పూట చెలపతి యింకా యిద్దరి ముగ్గురితో అని చూశాడు. కాని, వాళ్ళూ అదేవిధంగా ప్రశ్నించారు. చెలపతి బుస కొట్టి ఊరుకున్నాడు. ఎంతమందితో అని పోట్లాడతాడు ? ఆఖరికి జాలయ్యైనా సానుభూతి చూపుతాడేమోనని తంటాలు పడ్డాడు. కాని సానుభూతి సంపాదించేదెలా ?— ఆడవాళ్ళ పేరు చెప్పితే ?

"మా మరదలు ఒకటే తీరున వేధిం

చిందోయ్, నాకు తప్పక —" అన్నాడు.

"తప్పక ?" అన్నాడు జాలయ్య. 'ఆఁ, దాని కేం ఫర్వాలేదు' అనకండా.

చెలపతి వచ్చిన కోపాన్నంతా దిగ మింగాడు, శివుడు విషాన్ని మింగినట్టుగా: ఐతే, శివుడికి విషం మింగినందుకు కంఠం నల్లబడింది. చెలపతికి మొఖం ఎర్రబడింది.

ఆఫీసునించి యింటి కొచ్చేటప్పుడు నారాయమూర్తి కలిశాడు. అతనితో వెను కటిధోరణి మాని — "మన మేనేజరికి దానుడు ఎక్కువైంది" అన్నాడు చెలపతి.

"ఆఁ, ఎవరికి కాలేదు లెద్దూ ?" అన్నాడు నారాయణమూర్తి.

చెలపతి అక్కడికీ తమాయించు కున్నాడు.

"అది నిజమే. కాని, ఆ నీలు గెందుకూ ?" అన్నాడు.

"ఎవరికి లేదు. అంతా అపరబుద్ధులే!"

చెలపతి పిచ్చికుక్కలాగా రేగాడు. అది బజారు, నలుగురూ తిరుగుతున్నా రనే ధ్యాసకూడా లేకుండాపోయింది. నలుగుర్నీ చాటుచేసుకొని నారాయణ తప్పించుకు పోయేవరకు బ్రహ్మప్రళయ మైంది.

మర్నాడు చెలపతి ఆఫీసు కెళ్ళేవరకు తోటిక్లర్కు లంతా కూర్చుని లోకాభి రామాయణం మాట్లాడుకొంటున్నారు. నారాయణమూర్తి అంటున్నాడు :

"మాంసం తింటున్నా మని యెము కలు మెడని వేసుకుంటామా ? ఏదో కొంత చాటూ మరుగూ అని..." చివరి క్రియను అభినయంతో వ్యక్తం చేశాడు.

"అది నిజమే. కాని మోరల్ బ్యాక్ బోన్ లేకపోయినాక మనిషి ఎందుకూ ? మన చెలపతిని చూడూ, ఆతనికి ఎవ రన్నా భయంలేదు." అన్నాడు నరహరి.

"అయ్యగారికి రాచకాలే లేవు. ఏం చేసినా పబిలీగ్గా సేత్తారు" అన్నాడు ఆఫీసు బంట్రోతు, వేష్టుపేపరుబాస్కెటు తీసుకుపోతూ.

ఎందుకనో ఆవేళ చలపతి వాళ్ళ సంభాషణను ప్రశంస క్రింద మార్చుకో లేకపోయాడు. అంతా కలిసి తన్ను తాళం వేయిస్తున్నా రని అనుకున్నాడు. వెధవ బంట్రోతుకూడా వెటకారమా ? చెలపతి ఆవాళ సవ్యసాచిలాగా అందర్నీ ఎదుర్కొన్నాడు, ఓడించాడుకూడా.

మర్నాడు ఆఫీసులో చెలపతిని ఎవరూ పలుకరించలేదు. వాళ్ళ మౌనం, పెదాలు బిగిపట్టి నవ్వుకోటం అతను అసలు భరించలేకపోయాడు. తనంటే అంత చులకనా వీళ్ళకి ? వాళ్ళకి బుద్ధి చెప్పాలి. అంతా కలిసి అతన్ని వెలేస్తే అందర్నీ చెలపతి వెలివేశాడు. వాళ్ళు కూర్చున్నచోట కూర్చోకూడదనికూడా నిశ్చయించుకున్నాడు.

ఆ సాయంత్రమే చెలపతి నవ్వుతూ తన గుమాస్తాపనికి రాజీనామా యిచ్చి, విషాదంతో యింటికి తిరిగివచ్చాడు.

ఇంట్లో ఇల్లాలూ, పనిమనిషి సుబ్బామ్మా కీచులాడుకుంటూ ఉన్నారు. 'పోలిశెట్టి కొలతలో తగ్గించా'డంటున్నదిసుబ్బామ. 'కాదు నువ్వే డబ్బులు పిక్కావు' అంటున్నది ఇల్లాలు.

చెలపతి ఇద్దర్నీ సర్దాడు. అతనికి సుబ్బామ స్థితి చూస్తే జాలివేసింది. టీ పుచ్చుకుని ఆలోచనలో పడ్డాడు.

"వంచన ఎక్కడలేదూ ?" అన్నది మనస్సు.

"అంతటా ఉంది" అన్నది బుద్ధి.

"మరి సుబ్బామని నిలవదీయట మెందుకూ ?" అన్నది మనస్సు.

"అది నోరులేంది గనక" అన్నది బుద్ధి.

"దాన్ని సమర్థించేవా ళ్ళెవరూ లేరా ?" అన్నది మనస్సు.

ఈమాటు బుద్ధి సమాధాన మివ్వలేదు. మళ్ళీ ప్రశ్నించింది.

"నువ్వే చెయ్యకూడదూ, ఆ పనీ ?"

ఎలా చేస్తాడూ ? ఉపన్యాసాలద్వారా చెయ్యటానికి చాలా ఇబ్బందులున్నై. ముందు ప్రతి అంట్లవెధవా వేసే ప్రశ్నలకి జవాబు చెప్పాలి. ఇక మామూలు ప్రమాదాలా, ఉండనే ఉన్నై. పోతే, ఇక పత్రికలకి రాయాలి. మరి అంచాల్ని సమర్థిస్తే పత్రికలు వేస్తాయా ? వేసినా వెయ్యకపోయినా ముందు రచన తయారు చేసి చూడాలి.

చెలపతి కాగితం కలం తీసుకున్నాడు. కాని, కలం హర్తాంచేసింది. చొచ్చదోలి, మళ్ళీ ప్రయత్నించాడు — కోతిగంతులు వేసింది. అంకెలు పడ్డాయి.

ఈ కాలపు కుర్రవాళ్ళు వొప్పుకోరు గాని, ప్రతి కార్యానికీ దైవప్రేరణ ఉండి తీరుతుంది. అది లేకపోతే, ఎన్నో ఉద్యమాలు అడుగంటేవి. ఈ నాడు గాంధిని చూడరాదూ — ప్రతీపనీ దైవప్రేరణతోనే చేస్తాడు...సరే ఇప్పుడా గొడవ పోనివ్వు...

చెలపతి కలాన్ని స్వాధీనం చేసుకోలేక నానా అవస్థా పడుతుండగా, గాలి దేవుడి ప్రేరేప్షణతో పొట్లాముకి చుట్టిన చిత్తుకాగితం వచ్చి అతని ముందు పడింది. తీసి చూశాడు. అదో అమెరికన్ పత్రికలోది. దాంట్లో చిన్న కథ దొరికింది. 'దగా' దాని శీర్షిక. చదివి చూశాడు. అచ్చంగా తను రాయదలచుకున్నటువంటిదే ! వాడి కెలా తెలిసిందీ ? న్యూయార్కులో ఉన్న వెధవకి ! తన థీమ్ కొట్టేసినందుకు ముందు చలపతికి వాడిమీద కష్టం కలిగింది. కాని, తర్వాత వాడు రాసిపెట్టినందుకు సంతోషపడ్డాడు.

ఆ కథ సార మిది. రోజా అనే పని మనిషి తన యజమానురాలికోసం 'ఫోర్ జెట్ స్టోర్స్' లో కొన్ని సామానులు కొంటుంది. షాపువాడు మంచివస్తువుల ధరలు వేసి చౌకవస్తువులు ఇస్తాడు. తర్వాత యజమానురా లొచ్చి చౌక వస్తువు లిచ్చావే మని అడిగితే మీ పని

మనిషి ఇవే యిచ్చి బిల్లు అలా రాయమన్నదని చెప్తాడు యజమానురాలు అది నమ్మి రోజాను పనిలోనించి తీసివేస్తుంది.

చెలపతి చప్పున రోజాకు స్కర్టు విప్పదీసి, కోక కట్టాడు 'ఫోర్ జెట్ స్టోర్స్' పోలిశెట్టి అంగడిగా మార్చాడు పోతే పోలిశెట్టి అంగడిలో మెంతులూ, జీలకర్ర, ఆవాలు వగైరా మసాలా దినుసులుకూడా ఉంచవలసివచ్చింది లిప్‌స్టిక్, స్నో, హెయిర్ లోషన్ వగైరాలు తీసివేశాడు, రోజా పేరు మార్చి సుబ్బామ ఉంచాడు ఇక క్లయిమటిక్ కండిషన్సును బట్టి ఇద్దరికీ మొఖాన తారు పూశాడు అదనంగా పోలిశెట్టిలో లక్ష్మి ఉండిపోయేలాగా చేశాడు ఆ కథ చూసి, సంపాదకుడు వెంటనే ప్రకటించటమే కాకుండా, ఇంకా పంప మని ఉత్తరం రాశాడు మిత్రు లంతాకూడా చలపతిని ప్రోత్సహించారు, వీపు తట్టారు

చెలపతి రెట్టించిన ఉత్సాహంతో సాహిత్యసేవకు పూనుకున్నాడు సుబ్బామని పంపి ఒక వీశెడు చిత్తు కాగితాలు తెప్పించాడు అదృష్టవశాత్తు అవన్నీ ఒకటే సంచికలు అయినవి వాటిని ఉపయోగించలేదు తర్వాత డిటెక్టివ్ కథల పుస్తకాలూ, క్రైమ్, ఫిక్షన్ నావెల్సూ తెప్పించి, వాటిలో తను ఆలోచించిన థీమ్సు ఎవరన్నా దొంగిలించారా అని చూసేవాడు. పుస్తకాలు ఎక్కువ చదివినకొందికీ అతనికి ఆశ్చర్యమూ కోపమూ కలిగేది సరిగ్గా ఇతను ఆలోచించిన థీమ్సన్నీ అదివరకే ఎప్పుడో ఒకడు కొట్టేసి ఉన్నాడు. పోనీ చక్కగా రాశారా అంటే అదీ కనబడదు!

ఏం చేస్తాడు చెలపతి? మళ్ళీ దేవుడా అంటూ ఆ థీమ్సు అన్నీ రాసుకున్నాడు కొన్ని కథలను నాటికలుగానూ, కొన్ని నాటికలను కథలుగానూ కూడా మార్చుకోవలసివచ్చింది

అతని రచనలు పత్రికల్లో పడటం మొదలుపెట్టినాక, దేశంలో పెద్ద అల్లకల్లోలం బయలుదేరింది. మామూలు చెరువులో పెద్దచేపలు వచ్చిపడితే, మిగతా చేపలు ఎలా ఫీలవుతాయో అలా ఫీలయ్యారు ప్రజలు అతని ఉనికికి వాళ్ళలా బెదిరిపోవటానికి కారణంకూడా కొంతమంది స్వార్థపరులే

థ్యాంక్ గాడ్! ఈ నాటికైనా అతను చేసిన సేవ లోకం ఒప్పుకుంటున్నది.

"ఏమిటతను చేసిన సేవ?"

రెండు ఉద్గ్రంథాలు రాశాడు ఒకటి_దొంగతనాలు సమర్థిస్తూ, రెండు_లంచాలు సమర్థిస్తూ!"

"ఎలా సమర్థించాడు?"

"దొంగతనం ఒక ఇన్‌స్టింక్ట్. అది ప్రతివాడిలోనూ ఉంటుంది. కొంతమంది పిరికివాళ్ళు అది చెయ్యరు అంతమాత్రం చేత వాళ్ళు మహాత్ములు కారు చేసినవాళ్ళుకూడా కొంతమంది తెలివిగలవాళ్లు

పట్టుబడరు. అంతమాత్రంతో వాళ్లు దొంగతనం చెయ్యనివాళ్ళు కారు. పోతే తెలివితక్కువవాళ్ళే చిక్కుకున్నారు. వాళ్ళని పై రెండురకాలవాళ్ళు, ఎగతాళి చేస్తున్నారు. దండిస్తున్నారు. వాళ్ళని దండించడం న్యాయంకాదు. ఎవరికి కావలసిన వస్తువు వాడిదగ్గర లేనంత వరకూ ఈ దొంగతనాలు జరుగుతూనే ఉంటై. కాబట్టి ఎవడికి కావలసినవి వాడికి సప్లయి చేయాలి, లేదా దొంగతనానికి దండన తీసివేయ్యాలి ఇవి రెండూ చేయలేని పరిస్థితుల్లో పిల్లలకు స్కూళ్ళ లోనేదొంగతనం చేయడంలోగల మెలుకువలు చెప్పాలి."

"సరే, రెండోది ?"

"రెండోది నా 'కాపిటల్ !' చాలా గొప్పగ్రంథం. లంచంలో మోసం లేదంటాడు చెలపతి లంచం ఇద్దరి ఇష్టంమీదా జరిగే బేరం. అందులో ఎవరి కిష్టంలేక పోయినా, మానుకోవచ్చు. నిర్బంధమేమీ లేదు వివాహాల 'టరమ్సు'లో తీసుకుంటే లంచం గాంధర్వం లాంటిదంటాడు చెలపతి. దొంగతనం శిక్షమంటాడు. ఆయా పరిస్థితుల్నిబట్టి రెండూ సమానంగా సమర్థనీయాలే. దూరం ఆలోచిస్తే లంచం అన్ని కాలాల్లోనూ, జాతుల్లోనూ ఏదో ఒక రూపంతో ఉందంటాడు చెలపతి. లంచానికి ఇంకో పేరు గడ్డి కరవడం అది ఎలా వచ్చిందీ ? పూర్వం ఋషులు ప్రజలూ, శిష్యులూ ఇచ్చినకంద మూలాలూ నీహారధాన్యమూ తింటూ 'ఏదో ఆకూ అలమూ తిని బతుకుతున్నాము' అనేవాళ్ళు ఎందు కన్నారు వాళ్ళలా ? లంచ మని చెప్పుకోట్టానికి ఇష్టంలేక ! కాబట్టే లంచాని కింకోపేరు గడ్డికరవడ మయింది. కానుకలూ, నూడిదలూ, కప్పాలూ, కమీషనూ అంతా లంచంకిందికే వస్తుంది ఆఖరికి మన్వింటికెళ్ళేటప్పుడు తీసుకుపోయే పొట్లాము కూడా."

తాతయ్య పకపక నవ్వాడు,

"ఇలాంటివి చాలా చదివాను ఇంగ్లీషులో" అన్నాను నేను.

"నీ మొహం ! ఇంగ్లీషువాళ్ళకు ఋషులెక్కడ ఎడ్చారురా" అన్నాడు తాతయ్య.